క్లుప్తంగా

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు



మాట్లాడుతున్న ఎంఈఓ జయరాజు

కారేపల్లి: విధి నిర్వహణలో అకింతభావంతో పనిచేసినప్పుడే ప్రజల నుంచి గుర్తింపు లభిస్తుందని ఎంఈఓ దుగ్గిరాల జయరాజు అన్నారు. సోమవారం మండలంలోని బొక్కల తండా ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించి మాట్లాడారు. విద్యార్థులకు క్రమశిక్షతో నాణ్యమైన విద్యను అందించాలన్నారు. అనంతరం పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.13లక్షలు ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరు కాగా, పనులకు ఎంఈఓ ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వి.విజయలక్ష్మి, ఉపాధ్యాయులు మంగీలాల్, ఏఈ సురేష్, కాంట్రాక్టర్ రమేష్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

'ప్రజావాణి'లో దరఖాస్తుల వెల్లువ

కల్లూరురూరల్: కల్లూరు తహసీల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పలు గ్రామాల నుంచి వచ్చిన దరఖాస్తులను తహసీల్దార్ పులి సాంబశివుడు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో భూమి విలువ జమానత్‌కు సంబంధించిన దరఖాస్తు ఒకటి రాగా.. వర్షాలు ప్రారంభమైనందున గృహాల మధ్య గానీ, నివాస ప్రాంతాల్లో కానీ నీరు నిల్వ లేకుండా చూడాలని పలువురు దరఖాస్తులు ఇచ్చారు. డీటీ బాబ్జి ప్రసాద్, ఎంపీడీఓ దాసరి చంద్రశేఖర్, వెటర్నరీ డాక్టర్ మమత, విద్యుత్ శాఖ ఏఈ వెంకట్, ఐసీడీఎస్, వైద్య,ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

సన్న వడ్ల బోనస్ ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

బోనకల్: ప్రభుత్వం సన్న వడ్లకు ఇస్తానన్న రూ.500 బోనస్ వెంటనే ఇవ్వాలని రైతుసంఘం మధిర డివిజన్ కార్యదర్శి దొండపాటి నాగేశ్వరావు అన్నారు. ఈ మేరకు రైతుసంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ ఎమ్.రమాదేవికి సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నెలలు గడుస్తున్నా నేటివరకు బోనస్ రైతుల ఖాతాలో జమచేయకపోడం రైతులను మోసం చేయడమేనన్నారు. అధికారంలోకి వచ్చిన పార్టీలన్నీ తాము రైతుల సంక్షేమం, అభివృద్ధి కోసమే పనిచేస్తామని చెబుతారేతప్ప ఆచరణలో మాత్రం చేయరన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘాల నాయకులు కిలారు సురేష్, పారుపల్లి పూర్ణచందర్‌రావు, మందడపు రామారావు, గుగులోతు నరేష్, సాధం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు బోనాలు



జన్నారం ఎస్టీకాలనీలో బోనాలతో వస్తున్న మహిళలు

ఏన్కూరు: మండలంలోని జన్నారం ఎస్టీ కాలనీలో ప్రతిష్ఠించిన గ్రామ దేవతలకు సోమవారం గ్రామస్తులు బోనాలు సమర్పించారు. 16 రోజుల క్రితం గ్రామంలో ఆంజనేయస్వామి, ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ, నాభిశిల ప్రతిష్ఠామహోత్సవం నిర్వహించారు. 16 రోజుల పండుగను పురస్కరించుకుని సోమవారం జన్నారం ఎస్టీకాలనీ, కోనాయపాలెం గ్రామస్తులు మేళతాలాలతో బోనాలతో తరలి వచ్చి స్వామికి, అమ్మవార్లకు సమర్పించి పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. వానలు కురవాలని, పంటలు బాగా పండాలని, ప్రజలంతా సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని గ్రామ దేవతలను వేడుకున్నారు.

ఎల్‌కేజీ తరగతులు ప్రారంభించాలి



మాట్లాడుతున్న గుగులోత్ రామకృష్ణ

బోనకల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక పాఠశాల ల్లో ఎల్‌కేజీ తరగతులు ప్రారంభించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గుగులోత్ రామకృష్ణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన ఆసంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక పాఠశాలలకు హెచ్‌ఎం పోస్టులు కేటాయించాలని, బదిలీలు, ప్రమోషన్‌లు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు చిన్న రంగారావు, గోపాల్‌రావు, కోటయ్య, సురేష్, నారాయణ, నిర్మల, నరేంద్రసింహ, వెంకటేశ్వర్లు, కేశవరావు, హరికృష్ణ, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

కళాశాల.. పిలుస్తోంది

- అన్ని హంగులతో.. జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల
- అటానమస్ హోదా.. ఆధునిక సదుపాయాలు



సత్తుపల్లిలోని జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

సత్తుపల్లిటౌన్: చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభావంతులుగా నిలుపుతూ.. ఎంతో మంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దిన సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అన్ని హంగులతో భాసిల్లుతోంది. 1979లో స్థాపించిన కళాశాల నాక్-ఏ గ్రేడ్ గుర్తింపును సైతం పొందింది. పచ్చని ప్రశాంత వాతావరణంలో 12.25 ఎకరాల విస్తీర్ణంలో విశాలమైన తరగతి గదులు, సువిశాలమైన క్రీడా ప్రాంగణం, అధునాతన ప్రయోగశాలలు, నూతన సాంకేతికత కల్గిన కంప్యూటర్ ల్యాబ్స్ ఈ కళాశాల ప్రత్యేకత. గతేడాది నుంచి అటానమస్ కళాశాలగా రూపుదిద్దుకుని అధునాతన కోర్సులతో ఆకట్టుకుంటోంది.

యూనిఫాం, పుస్తకాలతో ప్రోత్సాహం..

కళాశాలలో చేరిన విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలు ఉచితంగా అందించి ప్రోత్సాహిస్తున్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు మల్లిక ఛారిటబుల్ ట్రస్ట్, పూర్వ విద్యార్థులు, దాతల సహకారంతో ఏటా అన్ని గ్రూపుల విద్యార్థులకు ప్రతిభ, నగదు పురుస్కారాలు, బహుమతులు అందిస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. విద్యార్థులలో ఒత్తిడిని తగ్గించటానికి యోగా, మెడిటేషన్ తరగతులు, క్షేత్ర పర్యటనల ద్వారా స్వీయ అనుభవాధ్యయనం చేస్తున్నారు.

మధ్యాహ్న భోజన పథకంతో..

విద్యార్థుల కోసం మధ్యాహ్న భోజన పథకం, వెనుకబడిన విద్యార్థుల కోసం రెమిడియల్ క్లాస్‌లు నిర్వహిస్తున్నారు. కంప్యూటర్ టీఎస్ స్కిల్స్ లాలెడ్జి సెంటర్‌తో పాటు 26వేల వరకు అకడమిక్ పుస్తకాలు, కంపిటేటివ్ జర్నల్స్, పోటీ పరీక్షల పుస్తకాలతో కూడిన కళాశాల గ్రంథాలయం, ఇంటర్నెట్ సదుపాయం కల్పిస్తూ డిజిటల్ లైబ్రరీగా తీర్చిదిద్దారు. ఉచిత వైఫై సేవలు అందిస్తున్నారు. విద్యార్థులు శారీరక ధారుఢ్యం పెంచుకునేందుకు జిమ్ సౌకర్యం కూడా ఉంది. టీ.శ్యాట్ ద్వారా యూనివర్సిటీ ప్రొఫెసర్లతో విద్యాబోధన జరుగుతుంది. మూడు డిజిటల్, ఒక స్మార్ట్ క్లాస్‌రూం ఉన్నాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా 15కేవీ సోలార్ విద్యుత్ ప్లాంట్, 10 కేవీ, 5కేవీ యూపీఎస్‌లు కళాశాలలో ఏర్పాటు చేశారు.

ఆధునిక సదుపాయాలుతో..

ఈ కళాశాల ఆధునిక సదుపాయాలు కలిగి 750 మంది విద్యార్థులకు విద్య నేర్చుకునేందుకు అవకాశాలు కల్పిస్తూ చదువుల తల్లిగా భాసిల్లుతోంది. రూసా(రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్) పథకం ద్వారా రూ.4 కోట్ల నిధులతో అదనపు తరగతి గదులు, వర్చువల్ క్లాస్‌రూమ్‌లు అందుబాటులోకి వచ్చాయి.



సర్టిఫికెట్లతో ఎన్‌సీసీ క్యాడెట్లు..

ప్రత్యేకతలు ఇవే..

కళాశాలలో ఎంఫిల్, పీహెచ్‌డీ అర్హత కలిగిన అధ్యాపకులు, విశాలమైన తరగతి గదులు, పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌తో తరగతుల నిర్వహణ, బాలికల కోసం ప్రత్యేకంగా వెయిటింగ్‌హాల్, ఒక ఎన్‌సీసీ యూనిట్, రెండు ఎన్ఎస్ఎస్ యూనిట్లు ఉన్నాయి. క్రీడలపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తుండటంతో వాలీబాల్, ఫుట్‌బాల్, ఖో-ఖో క్రీడలతో పాటు సాంస్కృతిక పోటీల్లోనూ కళాశాల విద్యార్థులు యూనివర్సిటీ స్థాయిలో రాణిస్తున్నారు. ఉమెన్ ఎంపవర్‌మెంట్ విభాగంతో బాలికలకు ప్రత్యేకంగా ఉచిత కరాటే శిక్షణ, స్పోకెన్ ఇంగ్లీష్, ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు వేర్వేరుగా హాస్టల్ వసతి సదుపాయాలు ఉన్నాయి.

సద్వినియోగం చేసుకోండి..



అటానామస్ హోదా కలిగిన ఈ కళాశాలకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి విద్యార్థులు వస్తున్నారు. బాలికల కోసం ప్రత్యేకంగా హాస్టల్ సదుపాయం ఉంది. అత్యాధునీక ల్యాబ్‌లతో పాటు ఆధునీక సదుపాయాలు కలిగిన ఈ కళాశాలలోని సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. దోస్తు వెబ్ ఆప్షన్‌లో కళాశాలను ఎంపిక చేసుకోండి.

– డాక్టర్ ఎస్.గోపి, ప్రిన్సిపాల్, జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సత్తుపల్లి

మెప్మా సిబ్బందితో కమిషనర్ సమీక్ష



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ వేణు

వైరా: వైరా మున్సిపాలిటీలో పని చేస్తున్న మెప్మా ఆర్‌పీలు, సీఎల్ఎఫ్, ఈసీ సభ్యులతో సోమవారం మున్సిపల్ కమిషనర్ చింతా వేణు.. కమిషనర్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి అప్పుల వసూలు, ఇందిరా మహిళా శక్తి యూనిట్లు, స్ట్రీట్ వెండర్ గ్రూపుల ఏర్పాటు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి నెలా స్వయం సహాయక సంఘాల సమావేశం నిర్వహించి పనితీరును సమీక్షించుకోవాలన్నారు. రాబోవు వర్షాకాలంలో పరిసరాల పరిశుభ్రత, డ్రైడే వంటి కార్యక్రమాలు కొనసాగేలా అవగాహన కల్పించాలన్నారు. మెప్మా జిల్లా కోఆర్డినేటర్ సుజాత పంచ సూత్రాల గురించి మెప్మా సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో టీఎంసీ బండారుపల్లి వెంకటేశ్వర్లు, ఆర్‌పీలు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల నిరసన



మధిర: నిరసన తెలుపుతున్న విశ్రాంత ఉద్యోగులు



సత్తుపల్లి: డీటీ శివకుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న పెన్షనర్ల సంఘం నాయకులు

మధిర/సత్తుపల్లి/తల్లాడ: కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న పెన్షనర్స్ రివిజన్ చట్టానికి వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం మధిరలో నిరసన ప్రదర్శన నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్ష , కార్యదర్శులు పారుపల్లి వెంకటేశ్వరరావు, చిన్నంశెట్టి మందయ్య మాట్లాడారు. అదే విధంగా సత్తుపల్లిలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగల సంఘం కార్యాలయం నుంచి తహసీల్ వరకు సంఘ నాయకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధానికి మహా విజ్ఞాపన పత్రాన్ని అందచేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ శివకుమార్‌కు వినతిపత్రం అందించారు. తల్లాడలో రిటైర్డ్ ఉద్యోగులు ర్యాలీ నిర్వహించి తహసీల్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ సురేష్‌కుమార్‌కు వినతి పత్రం అందించారు. వేతన సవరణ బిల్లు రిటైర్డ్ ఉద్యోగులకు తీరని ద్రోహం చేసినట్లేనని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్‌సీ, డీఏ వర్తించకుండా లోక్ సభలో ప్రవేశపెట్టిన బిల్లు అమల్లోకి వస్తే భవిష్యత్తులో రిటైర్డ్ ఉద్యోగులు తమ హక్కులను శాశ్వతంగా కోల్పోతారని పేర్కొన్నారు. పెన్షనర్లకు భంగం కలిగేలా చట్టం చేస్తే లక్షలాది మంది పెన్షనర్లు దేశవ్యాప్తంగా ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కేశవరెడ్డి, వనమారెడ్డి చెంచిరెడ్డి, ప్రకాశరావు, రామిశెట్టి సుబ్బారావు, కమలకుమారి, శ్రీదేవి, దాసు, వెంకటరత్నం, బాబు, కృష్ణయ్య, పురుషోత్తం, అప్పారావు, దగ్గుల రఘుపతిరెడ్డి, ఎం.లక్ష్మయ్య, తిరుపతిరెడ్డి, రామకృష్ణారావు, ముత్యాలు, అనసూర్య పాల్గొన్నారు.

మైనార్టీ గురుకుల ప్రిన్సిపాల్‌గా అరుణకుమారి



ప్రిన్సిపాల్ అరుణకుమారికి పుష్పగుచ్ఛం అందిస్తున్న యాజమాన్యం

కొణిజర్ల: మండలంలోని అమ్మపాలెం పంచాయతీ పరిధిలోని నిర్వహిస్తున్న తెలంగాణ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల(ఖమ్మం), కళాశాల ప్రిన్సిపాల్‌గా ఎంజె అరుణకుమారి సోమవారం బాధ్యతలు చేపట్టారు. టిమ్రీస్ సెక్రటరీ షఫీఉల్లా ఆదేశాల మేరకు ఖమ్మం బాలికల పాఠశాల ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్న ఆమెను బాలురు పాఠశాల, కళాశాలకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆమెకు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ లింగాల జితేష్ సాహిల్, స్కూల్ కోఆర్డినేటర్ శ్రీవిద్య, కాలేజీ కోఆర్డినేటర్ కొండలరావు, బోధన, బోధనేతర సిబ్బంది సాదరంగా ఆహ్వానించి అభినందనలు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు



తాళాలు వేసి ఉన్న బాణాపురం జీపీ

ముదిగొండ: మండలంలోని బాణాపురం పంచాయతీ కార్యదర్శి సురేష్ విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉంటున్నాడని గ్రామస్తులు ఇటీవల ఎంపీడీఓ, ఎంపీఓకి ఫిర్యాదు చేశారు. సురేష్ గత ఏడాది క్రితం ఏన్కూరు మండలం నుంచి డిప్యూటేషన్‌పై ఇక్కడకు వచ్చాడు. అప్పటి నుంచి పంచాయతీ కార్యాలయం ఎప్పుడు చూసినా తాళాలు వేసి ఉంటుందని, ప్రజలకు, అధికారులకు ఎలాంటి సమాచారం లేకుండా వచ్చి వెళ్తూ, విధులకు హాజరు కావడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఎంపీడీఓ, ఎంపీఓ బాస్కర్‌రావు, వాల్మీకి కిషోర్‌లను వివరణ కోరగా.. అతనిపై గ్రామస్తులు ఫిర్యాదు చేసిన మాట వాస్తవమేనని, ఈ విషయమై అతనిని హెచ్చరించినా తీరు మారడం లేదన్నారు. దీంతో పై అధికారులు సరెండర్ చేయమని చెప్పారని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

ముదిగొండ: మండలంలోని ఖమ్మం-కోదాడ జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ముదిగొండకు చెందిన నరేందర్, రాఘవాపురం గ్రామానికి చెందిన ఉదయ్ ఖమ్మం నుంచి ఆటోలో ముదిగొండకు వస్తున్నారు. జాతీయ రహదారిపై ఆటో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టగా ఉదయ్, నరేందర్ గాయపడడంతో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

ఇసుక అక్రమ రవాణాదారులపై కేసు

తల్లాడ: లారీలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపారు. మణుగూరు నుంచి మండలంలోని కుర్నవల్లికి లారీలో ఇసుక తరలిస్తారనే సమాచారంతో సోమవారం తనిఖీ చేపట్టామని పేర్కొన్నారు. ఎలాంటి అనుమతి లేనట్లు తేలడంతో లారీని సీజ్ చేసి గుడిసెల కిరణ్, వికాస్‌రెడ్డి, సాయిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

చింతకాని: చింతకానికి కొడవటికంటి వెంకటేశ్వర్లు కానరాకుండా పోవడంతో ఆయన కుటుంబీకుల ఫిర్యాదు మేరకు సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఆయన ఖమ్మంలో పనికి వెళ్తున్నానని ఈనెల 18వ తేదీన వెళ్లి తిరిగి రాలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ లేకపోవడంతో వెంకటేశ్వర్లు తండ్రి బక్కయ్య ఫిర్యాదు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

మహాసభను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

కొణిజర్ల: జూలై 4న ఖమ్మంలో నిర్వహించే తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా 26వ మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తాటి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. సోమవారం కొణిజర్ల దొండపాటి భవన్‌లో పిట్టల రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన మహాసభల ఆహ్వాన సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ కార్మికుల హక్కులను కాలరాసే విధంగా కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అంటగట్టాలని చూస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్, నాయకులు పీవీ రావు, కంపసాటి వెంకన్న, పిట్టల రాంబాబు, తండు సోమయ్య, ఆహ్వాన సంఘం అధ్యక్షుడు సీతారాములు, ప్రధాన కార్యదర్శి స్వర్ణ రమేష్, మల్లయ్య వెంకన్న, నాయుడు వెంకన్న రాములు, నాగేశ్వరరావు, ఖాసీమ్ తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న మండల వైద్యాధికారి ఆల్తాఫ్

చింతకాని: క్షయవ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల వైద్యాధికారి డాక్టర్ ఆల్తాఫ్ అన్నారు. సోమవారం మండలంలోని నాగులవంచ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రధాన మంత్రి టీబీ ముక్తభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 98మందికి క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వారం రోజులకు పైబడి జ్వరం, ఎడతెరపి లేకుండా దగ్గు రావటం, మూడో వంతు బరువు తగ్గటం, చెమటలు పట్టడం, ఆకలి మందగించటం వంటి లక్షణాలు కలిగిన వారికి క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలను నిర్వహించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పల్లె దవాఖానా వైద్యుడు డాక్టర్ వేణుమాధవ్, సీహెచ్ఓ వీరేందర్, హెల్త్ సూపర్‌వైజర్లు కృష్ణారావు, జ్యోతిరత్న, ఇమామ్, ఏఎన్ఎంలు సుజాత, నర్సమ్మ, ఎస్‌టీఎల్ఎస్ మహేష్, ఐసీటీసీఎల్‌టీ వెంకటేశ్వర్లు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు ప్రోత్సాహకాలు



విద్యార్థికి నగదు అందిస్తున్న దాత విష్ణుమూర్తి

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పది ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు సోమవారం నగదు ప్రోత్సాహకాలు అందించారు. గ్రామానికి చెందిన శ్రీవేంకటేశ్వర ఆలయ రిటైర్డ్ ఈఓ అల్లూరి విష్ణుమూర్తి.. తన భార్య భానుమతి జ్ఞాపకార్థం అత్యధిక మార్కులు సాధించిన 13మంది విద్యార్థులకు ప్రతిభ ఆదారంగా రూ.5వేలు, రూ.3వేలు చొప్పున నగదు అందించడంతో పాటు, మరో 11మందికి చేతివాచ్, పెన్నులు అందించారు. ఈ సందర్భంగా దాతను హెచ్‌ఎం జ్యోతి, ఉపాధ్యాయులు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలకృష్ణ, యాకోబు, వత్సలాదేవి, పద్మజ, సోమలక్ష్మి, తిరుమల, సుమలత, లక్ష్మి, శ్రీను తదితరులున్నారు.

పూర్వ విద్యార్థులు..



బ్యాగులు అందించిన పూర్వ విద్యార్థులు

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు పూర్వ విద్యార్థులు ఆర్థికసాయం అందించారు. 1983–84 సంవత్సరంలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు.. ప్రతిభ చూపిన ముగ్గురు విద్యార్థులకు రూ.పదివేల చొప్పున రూ.30వేలు అందించారు. అదే విధంగా మండలంలోని గోపాలపేట ప్రాథమిక పాఠశాల, అన్నారుగూడెం ఉన్నత పాఠశాలలో నూతనంగా చేరిన ఆరో తరగతి విద్యార్థులకు బ్యాగులు, పెన్నులు, స్కేల్స్ అందజేశారు.

సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వాల విఫలం



మాట్లాడుతున్న గోపాలరావు

మధిర: మధిర మున్సిపాలిటీలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు అన్నారు. సోమవారం స్థానిక బోడెపూడి భవనంలో నిర్వహించిన పట్టణ కమిటీ, శాఖ కార్యదర్శుల, ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మధిర మున్సిపాలిటీలోని హరిజనవాడ, బంజారా కాలనీ, హనుమాన్ కాలనీ, ఎంప్లాయిస్ కాలనీ, ముస్లిమ్స్ కాలనీలో పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు ఇచ్చిన చరిత్ర ఒక్క సీపీఎం ఎమ్మెల్యేలకే సాధ్యపడిందన్నారు. బీఆర్ఎస్ – కాంగ్రెస్ పార్టీలు ఒకరిపై ఒకరు విమర్శించుకోకుండం తప్ప.. ప్రజలకు చేసిందేమి లేదన్నారు. ఈ సమావేశంలో సీపీఎం పట్టణ కార్యదర్శి పడకంటి మురళి, జిల్లా కమిటీ సభ్యుడు నరసింహారావు, పట్టణ కమిటీ సభ్యులు రామనరసయ్య, కిషోర్, బేగం, రాధాకృష్ణ, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



కాలనీని పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకుడు దయానంద్, కమిషనర్ నర్సింహా

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని సరస్వతీ ఆలయం ఎదురుగా, వేంసూరురోడ్‌లోని డబుల్‌బెడ్‌రూం ఇళ్లను రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు దయానంద్, మున్సిపల్ అధికారులు పరిశీలించారు. ఈ క్రమంలో స్థానికులు సమస్యను వివరించగా, స్పందించిన దయానంద్ కాలనీల్లో డ్రెయినేజీ సమస్య లేకుండా చూడాలని, సీసీరోడ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు చేయాలని మున్సిపల్ కమిషనర్ కె.నర్సింహాకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ సురేష్, కాంగ్రెస్ నాయకులు చల్లగుళ్ల నర్సింహారావు, దోమ ఆనంద్‌బాబు, ఎండి కమల్‌పాషా, గాదె చెన్నారావు, కృష్ణారావు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల వినియోగం ప్రమాదకరం



కారేపల్లి కస్తూర్బా గాంధీ విద్యాలయంలో మొక్కలు నాటుతున్న దృశ్యం

కారేపల్లి: మాదకద్రవ్యాల వినియోగం ప్రమాదకరమని, చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని కారేపల్లి ఎస్సై బి.గోపి అన్నారు. సోమవారం కారేపల్లి కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల విద్యాలయంలో మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా.. కారేపల్లి పోలీసుల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. అనంతరం డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కస్తూర్బా ఎస్ఓ ఝాన్సీసౌజన్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి



సత్తుపల్లిటౌన్: ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



చింతకాని: మొక్క నాటుతున్న బీజేపీ నాయకులు

మధిర/చింతకాని/సత్తుపల్లిటౌన్: మధిర, సత్తుపల్లి, చింతకాని బీజేపీ కార్యాలయాల్లో సోమవారం శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని బలిదాన్ దివాస్‌గా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల అధ్యక్షులు బానోత్ విజయ్, సాలి శివకృష్ణ, నరేష్, నాగస్వామి, రహీంతుల్లా, పాలకొల్లు శ్రీను, శివ, నాగరాజు, శేషగిరిరావు, వసంతరావు, మధిర రూరల్, టౌన్ అధ్యక్షులు గడ్డం శ్రీహరిచౌదరి, శివరాజు సుమంత్, కార్యవర్గ సభ్యులు కృష్ణారావు, స్వర్ణాకర్, రమేష్, రామకృష్ణ, రామాంజనేయులు, బీజేపీ మండల అధ్యక్షుడు కొండా గోపి, ప్రధాన కార్యదర్శులు ఇమ్మడి సత్యనారాయణ, గోద మంగయ్య, నాయకులు శ్రీను, సిద్దేమియా, ఉపాధ్యక్షుడు సత్యమూర్తి, బూత్ అధ్యక్షుడు హరికృష్ణ పాల్గొన్నారు.